సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

శాకంబరిగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు



నీలమ్మ వేపచెట్టు అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

అల్లిపురం: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేపచెట్టు అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు జోగారావు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలు, పనస పండ్లు, పైనాపిల్ పండ్లతో విశేషంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి శాఖాన్నం ప్రత్యేక ప్రసాదంగా భక్తులకు అందించారు.

అన్నదానం గొప్పది



అన్నదానం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: అన్నిదానాల్లో కంటే అన్నదానం గొప్పదని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా వీధిలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు పీల వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆమె ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.


ఆంజనేయ ఆలయంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామివారి దేవాలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం కౌంటర్‌లో భక్తులు రూ.516 చెల్లించి హోమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు.

విద్యార్థులకు కల్కి సినిమా చూపించిన 'మట్టపల్లి'



కల్కి సినిమా వీక్షించిన విద్యార్థులు

దాబాగార్డెన్స్: సంఘ సేవకుడు, చల్మాజీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ చైర్మన్ మట్టపల్లి హనుమంతరావు పలువురు విద్యార్థులకు ఆదివారం కల్కి సినిమా చూపించారు. నగరంలోని మెలోడి థియేటర్‌లో ఈ చిత్రాన్ని చూపించి వారిలో ఆనందం నింపారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్స్ కోశాధికారి భాస్కరరావు, సభ్యుడు మురళీ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

నత్తనడకన మరమ్మతులు

- సా...గుతున్న జోన్–4 కార్యాలయ అభివృద్ధి పనులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, అధికారులు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు జీవీఎంసీ పరిధిలోని జోన్–5 కార్యాలయం తప్పా.. మిగిలిన అన్ని జోనల్ కార్యాలయాల మరమ్మతులు, అభివృద్ధికి రూ.50 లక్షల నిధులను కమిషనర్ మంజూరు చేశారు. దీంతో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి అన్ని జోనల్ కార్యాలయాల పనులను పూర్తి చేశారు. జోన్–4 కార్యాలయ పనులు మాత్రం నెలలు కావస్తున్నా.. నేటికీ పూర్తికాలేదు. దీంతో ఈ కార్యాలయానికి వస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నిలిపిపోతున్న పనులు

మరమ్మతులు పేరుతో మొదట్లో విద్యుత్ వైరింగ్, నెట్ కనెక్షన్‌లు తొలగించి కొన్ని రోజులు కార్యాలయ పనులు నిలిపివేశారు. తరువాత మళ్లీ విద్యుత్ పునరుద్ధరణ, పెయింటింగ్‌లు, అధికారుల చాంబర్ల పనులంటూ మరికొన్ని రోజులు పనులకు బ్రేక్ వేశారు. ఇప్పుడు మొత్తం కార్యాలయం పనులంటూ దాని చుట్టూ కర్రలతో సెంట్రింగ్ చేసి ప్రజలు లోపలకి వెళ్లలేని పరిస్థితి కల్పించారు. దీని వల్ల వివిధ పనుల మీద వ్యయ ప్రయాసలతో కార్యాలయానికి వచ్చిన జోన్ పరిధిలోని 12 వార్డుల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బయట గేటు దగ్గర నుంచి జోనల్ ఆఫీస్ లోపలి వరకు వెళ్లడానికి సాహసం చేయాల్సి వస్తోందని వృద్ధులు, దివ్యాంగులు వాపోతున్నారు. ఎప్పుడు ఏ కర్రలు విరిగిపడి మీద పడతాయోనన్న భయంతో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందంటున్నారు. పనులు జరుగుతుండటంతో జోనల్ స్థాయిలో అధికారులు కొన్ని సందర్భాల్లో కార్యాలయంలోకి రావడం లేదు. మరికొన్ని సార్లు వచ్చినా కింద షెల్లార్లలోనే ఉండిపోతున్నారు. జీవీఎంసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లకు ఇచ్చిన సమయం పూర్తయినా.. ఇంకా కార్యాలయాన్ని అప్పగించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ ఉన్నాధికారులు స్పందించి వెంటనే జోన్–4 కార్యాలయ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



మరమ్మతుల దశలో ఉన్న జీవీఎంసీ జోన్-4 కార్యాలయ భవనం

మాయమైన జనరేటర్లు..

జోన్–4 ఆఫీస్‌లో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో కార్యాలయంలో ఉండే నాలుగు విద్యుత్ జనరేటర్లు మాయమైనట్లు పలువురు తెలిపారు. కొన్నేళ్లుగా జోనల్ కార్యాలయం సౌకర్యం సెంటర్ పక్కనే జనరేటర్లు ఉండేవని.. మరమ్మతులు జరుగుతున్న క్రమంలో అవి కనిపించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లు వారికి సంబంధించిన సూపర్‌వైజర్ల పనులు మాత్రమే చేయించాలని, కార్యాలయంలో ఉన్న జీవీఎంసీ ఆస్తులు ఎందుకు తరలించాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెండు రోజుల్లో పూర్తి చేస్తాం

జీవీఎంసీ జోన్–4 కార్యాలయ మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు ఇచ్చిన సమయం అయిపోయింది. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి అప్పగిస్తాం.

– సంతోషికుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జీవీఎంసీ

దైవం ఇచ్చిన వరమే సంగీతం



మాట్లాడుతున్న సంగీత విద్వాంసుడు పంతుల గోపాలరావు

బీచ్ రోడ్డు: మనసును రంజింప చేసేది రాగమని, దైవం ఇచ్చిన వరమే సంగీతమని సంగీత విద్వాంసుడు పంతుల గోపాలరావు అన్నారు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం రాంనగర్ రాఘవేంద్ర స్వామి మఠం సమావేశం మందిరంలో ఐ.వి.ఎల్.శాస్త్రి సంగీత సమితి ఉచిత సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంగీతం, భక్తి రెండు కలిసి సాగాలని, గురువు వద్ద భక్తితో ఉండటం, జ్ఞానాన్ని పొందడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థికి ఏ విధంగా జ్ఞానాన్ని అందించాలనేది గురువుకు అవగాహన ఉంటుందన్నారు. విభిన్న స్థాయిల్లో ఉన్న విద్యార్థులకు అనుగుణంగా గురువు బోధన చేసి వారికి అవగాహన కల్పిస్తారని చెప్పారు. నిత్యం సాధన చేస్తూ ఉంటే విద్యలో పరిణితి సాధించడం వీలవుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు ఆకొండి వెంకటరావు స్వయంగా పంతుల గోపాలరావుకు పాద పూజ నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జగన్మోహనరావు, కోశాధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ సాగిన భక్తజనం



గొడుగులు వేసుకుని గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గోపాలపట్నం: గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఆదివారం వర్షం ఇబ్బంది కలిగించినా ఆగలేదు. గొడుగులు వేసుకుని కొందరు, తడుస్తూనే మరి కొందరు భక్తులు అప్పన్న చెంతకు చేరారు. చిన్న పిల్లలను భుజాలపై మోసుకుంటూ తల్లిదండ్రులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

అర్ధరాత్రి దాటినా సేవా కార్యక్రమాలు

భక్తులకు సేవలందించడమూ పుణ్యమే అనే భావనతో పలువురు, పలు సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా భక్తులకు తినుబండారాలు, దాహార్తి తీర్చే పానీయాలు అందించారు. బాజీ జంక్షన్ వంశీ సూపర్ మార్కెట్ వద్ద ఆటో అసోసియేషన్ సభ్యులు మాత్రం రాత్రాంతా పండ్లు, టీలు, మంచినీరు, టిఫిన్లు గిరిప్రదక్షిణ చేసిన భక్తులకు పంపిణీ చేశారు. ఆదివారం ఉదయం కూడా వేడి వేడి ఇడ్లీ అందించి భక్తుల ఆకలి తీర్చారు.

సెయిల్‌లో విలీనానికి ఎంపీలు గళం విప్పాలి



దీక్ష శిబిరంలో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం కోసం రాష్ట్రానికి చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వం వద్ద గళం విప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో ఆదివారం కొనసాగిన 1,456వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, మాంగనీస్ గనులకు అనుమతులు మంజూరు చేసిన క్రమంలోనే ఎంపీలు కూడా కేంద్రం వద్ద పట్టుబట్టి విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పరిరక్షణ కమిటీ నాయకులు దాసరి శ్రీనివాస్, గుమ్మడి నరేంద్ర, ఎస్.సత్యనారాయణ, బి.తవుడన్న, సూర్యం, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, నాయక్, గోపయ్య తదతరులు పాల్గొన్నారు.

యోగా గురువు రమేష్‌కు సత్కారం



యోగా గురువు రమేష్‌ను సత్కరిస్తున్న శిష్యులు

ఎంవీపీ కాలనీ: గురు పౌర్ణమి సందర్భంగా ఎంవీపీ కాలనీ సెక్టార్–11లోని గాదిరాజు ఎంపైర్‌లో ఓం యోగా వ్యవస్థాపకుడు, యోగా శిక్షకుడు డాక్టర్ సీహెచ్ రమేష్‌ను ఆయన శిష్య బృందం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పలువురు వ్యక్తలు మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గురు పూజోత్సవం రోజు సత్కరించుకోవడం భారతీయ సంప్రదాయమన్నారు. యోగా శిక్షణ ద్వారా డాక్టర్ రమేష్ అందిస్తున్న సేవలను కొనియాడారు. బీజేపీ నగర అధ్యక్షుడు రవీంద్ర, శాంతారావు, సురేష్ బాబు, శర్మ, వరలక్ష్మీ, దేవి, రూప పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ



సమావేశంలో పాల్గొన్న గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం తొలి సమావేశం ఆదివారం నిర్వహించారు. 1963 నుంచి 2024 వరకు చదువుకున్న విద్యార్థులు ఇటీవల సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆ కార్యవర్గం సమావేశమై భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. పూర్వ విద్యార్థులను సమీకరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు.

మరో సమావేశం నిర్వహించి అందరి సభ్యుల ఆలోచనలను సమీకరించి నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మజ్జూరి శ్రీనివాస్, కార్యదర్శి వైఎస్ ప్రసాద్, సహాయ కోశాధికారి కోనేటి సత్తిబాబు, ఉపాధ్యక్షుడు మేడిది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో దిగుతుండగా ప్రమాదం.. వ్యక్తికి గాయాలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి

ఆరిలోవ: ఆటో దిగుతూ ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కిందపడి గాయపడ్డాడు. ప్రస్తుతం అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. జాతీయ రహదారిపై పాత డెయిరీ ఫారం కూడలి వద్ద ఓ వ్యక్తి ఎండాడ వైపు వెళ్లే ఆటో ఎక్కాడు. అతడు ఎండాడ కూడలిలో దిగాల్సి ఉంది. ఆ జంక్షన్ ముందు సిగ్నల్ పడే సమయంలో ఆటో పూర్తిగా ఆగక ముందే కిందకు దిగే ప్రయత్నం చేస్తూ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి స్వల్ప గాయాలై స్పృహ కోల్పోయాడు. స్థానికుల సహాయంతో ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ అతడికి వైద్యం అందిస్తున్నారు. స్పృహ రాలేదు. తల లోపల భాగంలో తీవ్ర గాయాలు తగిలి ఉంటాయని వైద్యులు భావిస్తున్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తికి ప్రమాదంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఎవరైనా ఉంటే ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: ఎన్ఏడీ జాతీయ రహదారి బస్ స్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. సుమారు 40 నుంచి 45 ఏళ్ల వయసు గల వ్యక్తి శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఈ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- షిర్డీసాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు
- అన్నాభిషేకాలు చేసిన అర్చకులు, భక్తులు



పుష్పాలంకరణలో షిర్డీసాయిబాబా



ఓం సాయిబాబా ఆలయంలో బాబాకు అన్నాభిషేకం

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి షిర్డీసాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నాభిషేకాలు, అన్నప్రసాద వితరణలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించి తరించారు. సింగ్ హోటల్ జంక్షన్‌లోని శ్రీగణేష్ పార్వతి సమేత ఓంకార శివాలయం, ఓం సాయిబాబా ఆలయంలో కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం, తిరువీధి ఉత్సవం జరిపారు. కమిటీ ప్రతినిధులు వడ్ల రామారావు, కృష్ణారావు, డి.అప్పారావు, కె.శంకరరావు, వి.రవి, పి.నాగభూషణం, సభ్యులు పాల్గొన్నారు.

– 29వ వార్డు రామజోగిపేటలోని బాబా మందిరాల్లో ప్రత్యేక అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వన్‌టౌన్‌లోని బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. బురుజుపేట సాయిబాబా మందిరంలో పంచామృతాభిషేకాలు, విభూది, క్షీర, పూలాభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం నక్షత్ర, చంద్ర హారతులు, దివ్యజోతులతో నీరాజనం, సాయంత్రం పల్లకీ సేవ, శోభాయాత్ర జరిపారు.



బంగారుమెట్ట సాయి దర్బార్‌లో విశేష అలంకరణలో సాయినాథుడు, పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సాయి పూజలు

అల్లిపురం: అచ్చియ్యమ్మపేటలోని షిర్డీసాయి ధ్యాన మందిరం, కుమ్మర వీధిలోని సాయిబాబా దేవాలయం, సాయిబాబా వీధిలోని సాయిబాబా ఆలయంతోపాటు 32, 33, 34 వార్డుల్లో గల సాయిబాబా మందిరాల్లో విశేష అభిషేకాలు, ప్రత్యేక హారతులు నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట మందిరంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, లండా రమణ, వాసుపల్లి నారాయణ, దూడ అప్పారావు తదితరులు పూజలు చేశారు. వారికి ఆలయ ఫౌండర్ ఉమ్మిడి నాగరాజు, అర్చకులు స్వాగతం పలికారు. వారికి బాబా శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు పంపిణీ చేశారు. టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో సాయిబాబాకు ఈవో జీవీ రమాబాయి, అర్చకుడు సాయిశర్మ ఆధ్వర్యంలో కుంబాభిషేకం, విశేష అభిషేకాలు నిర్వహించారు. బంగారుమెట్టలోని సాయి దర్బార్‌లో బాబాకు విశేష పూజలు చేశారు. సాయి వ్రతాలు, నారాయణ సేవ నిర్వహించారు.



అచ్చియ్యమ్మపేట మందిరంలో షిర్డీసాయిని దర్శించుకుంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్



శివరామకృష్ణ దేవస్థానంలో బాబాకు పూజలు చేస్తున్న ఈవో జీవీ రమాబాయి, భక్తులు



అంగడిదిబ్బ ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న జామి సత్యనారాయణ

శాకంబరిగా కొత్తమ్మవారు

అమ్మవారి వీధిలో కొలువైన కొత్తమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు, భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఘనంగా పూజా కార్యక్రమాలు

మహారాణిపేట: స్థానిక అంగడిదిబ్బ డ్రైవర్ల సంఘం కార్యాలయ ఆవరణలోని షిర్డీసాయి, లక్ష్మీగణపతి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు గోపాజోష్యుల జగన్నాథశర్మ సాయినాథుడికి విశేష పూజలు, పుష్పాలంకరణ, అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జామి సత్యనారాయణ, కార్యదర్శి కె.త్రినాథ్, డైరెక్టర్ వై.సత్యనారాయణ, సారిపల్లి రవి కుమార్, ఒమ్మి ఈశ్వరరావు, ఒమ్మి కిషోర్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్, నాగమణి దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి నేరాలు చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలన్నారు. ఎటువంటి గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు ఎస్ఐ సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు పోలీస్ సిబ్బంది అప్పగించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

మద్రిపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని కంచరపాలెం ఐదో పట్టణ ఏఎస్ఐ ఆదిరాజు సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎటువంటి నేరాలకు పాల్పడకూడదని, గొడవల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లప్పుడూ రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందని, బుద్ధిగా నడుచుకోవాలని సూచించారు.

ప్రజా సంఘాలపై కేసులు ఎత్తేయండి

అల్లిపురం: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న ప్రజా సంఘాలపై గత ప్రభుత్వ హయాంలో పెట్టిన పోలీసు కేసులు ఎత్తివేయాలని సీపీఐ విశాఖ జిల్లా పార్టీ నాయకులు ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. 2016లో ప్రత్యేక హోదా కోరుతూ ప్రజాప్రతినిధుల వైఖరిపై ఆందోళన చేపట్టిన పార్టీ నాయకులు అత్తిలి విమల సహా నలుగురిపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. 2018లో అందాల పోటీల నిర్వహణపై నిరసన చేపట్టిన మహిళా సంఘాల ఐక్య వేదిక అత్తిలి విమల సహా 29 మందిపై పెట్టిన కేసు తదితర నాలుగు కేసులను వారు వివరించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు

భీమునిపట్నం: రక్తదానం ఎంతో గొప్పదని, తద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు అన్నారు. కీతిన్‌పేటలో అసోసియేషన్, యరబాల చారిటీ సంయుక్తంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు, ఇతర సందర్భాల్లో అవసరమైన వారికి తమ వంతు సాయం అందివ్వడానికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యరబాల చారిటీ చైర్మన్ యరబాల ప్రసాద్ మాట్లాడుతూ తరచూ ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారిని వెంటనే ఆదుకుంటున్నామని తెలిపారు. 80 మంది రక్తదానం చేశారు.

న్యాయం చేసే వరకూ ఆందోళన చేస్తాం



బక్కన్నపాలెం హుద్‌హుద్ కాలనీలో నిరసన తెలుపుతున్న రైతులు

మధురవాడ: భూములు కోల్పోయిన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం ప్రాంతాల రైతుల సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన కొనసాగిస్తారని సీపీఎం నాయకులు డి.అప్పలరాజు అన్నారు. రెండో రోజు ఆదివారం కూడా బక్కన్నపాలెంలోని సినీ పరిశ్రమ నిర్మించిన హుద్‌హుద్ కాలనీ వద్ద రైతులు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా చూడడంతోపాటు వారితో రోజుకో విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. బాధిత రైతులకు కనీసం కాలనీ ఇళ్లయినా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, రైతు సంఘం పెద్దలు బి.పోతురాజు, ఎన్.పైడిరాజు, నాగేశ్వర్, అప్పారావు, కాంతం పాల్గొన్నారు.